క్లుప్తంగా

నామినేషన్ కేంద్రం పరిశీలన


నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పర్వం త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని లింగారెడ్డిగూడలోని ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించి, గట్టి బందోబస్తు చర్యలు చేపట్టాలని పోలీసులను ఆయన ఆదేశించారు. వంద మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ రంగస్వామి, సీఐ ప్రతాప్‌లింగం, ఆర్డీఓ వెంకట మాధవరావు పాల్గొన్నారు.

ఆరోపణలు మానుకోవాలి

కొత్తూరు: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను మానుకోవాలని ఆ పార్టీ నాయకులు హెచ్చరించారు. సోమవారం కొత్తూరు పట్టణంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల పెంజర్లలో నిర్వహించిన సమావేశంలో ప్రతాప్‌రెడ్డి, శంకర్‌లు బీఆర్‌ఎస్ నాయకులను ఉద్దేశించి ఎలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయలేదన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, ఇతర విషయాలపై మాట్లాడితే తప్పేముందని అన్నారు. కావాలని బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు జగన్, నందు, ఆంజనేయులు, పాల్గొన్నారు.

బోగస్ ఓట్లను తొలగించండి

బీఎస్పీ నాయకుడు శ్రీనివాస్


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కేశంపేట: గ్రామంలో ఎలాంటి ఆధారం లేని పలువురిని ఓటర్ లిస్టులో చేర్చారని మండల బీఎస్పీ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆరోపించారు. మండలంలోని కాకునూర్ గ్రామంలో నివాసం లేనివారి పేర్లను ఓటరు లిస్టులో చేర్చారని బీఎస్పీ, కాంగ్రెస్ నాయకులు సోమవారం తహసీల్దార్ అజీంఅలీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలోని బయన్నగడ్డ తండాకు చెందిన 30 మంది గ్రామంలో నివాసం లేని వారు, మరణించిన వారు కలిపి 189 మంది ఉన్నట్లు తెలిపారు. వీరందరిని విచారించి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికి ఒక్కటే ఓటు ఉండాలన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీశైలం, హన్మంత్‌రెడ్డి, పర్వతాలు, తులసీ రాములు ఉన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య


కృష్ణ మృతదేహం

కేశంపేట: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా నర్వ మండలంలోని జగనపల్లికి చెందిన కృష్ణ (40) కుటుంబ సభ్యులతో కలిసి మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలోని ఓ మామిడితోటలో కూలీ పనులు చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. దసరా పండుగకు భార్య పుట్టింటికి వెళ్లడంతో ఫ్యాన్‌కు ఉరేసుకొని మృతి చెందాడు. మృతుడి భార్య సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఇబ్రహీంపట్నం: తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన పట్టణంలోని మంచాల రోడ్డులో చోటు చేసుకుంది. పాల్వ సరిత, మహేందర్ ఇంట్లోనే బ్యాంగిల్ స్టోర్, లేడీస్ కార్నర్ నడుపుతున్నారు. ఆదివారం ఇంటికి తాళం వేసి చెరువుగట్టుకు వెళ్లారు. దీనిని గమనించి దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న నాలుగున్నర తులాల బంగారాన్ని దోచుకెళ్లారు. కుటుంబసభ్యులు సోమవారం తిరిగి వచ్చి చోరీ విషయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నిర్భయంగా ఓటేయండి

ఆమనగల్లు: ప్రజలు నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటేయాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ఆమనగల్లు పట్టణంతో పాటు నుచ్చుగుట్టతండా, ఎర్రబిక్య తండాల్లో సోమవారం పోలీసులు కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. కవాతులో ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాం, ఏఎస్‌ఐలు బాల్‌రెడ్డి, యాదయ్య, పోలీసు సిబ్బంది, కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నాయి.

మోసపోతే.. గోస పడతాం

- చేతికి ఓటువేస్తే మిగిలేది మొండి చేయే
- ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



షాద్‌నగర్‌రూరల్: ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్‌రూరల్: రాబోయే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటువేస్తే మిగిలేది మొండి చెయ్యి అని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఎద్దేవా చేశారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని హాజిపల్లి, కిషన్‌నగర్, మొండోనిరాయితండా, చౌలపల్లి, చించోడ్, దేవునిపల్లి, అయ్యవారిపల్లి, ఉప్పరిగడ్డతండా, గ్రామ పంచాయతీల్లో అంజయ్యయాదవ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు డప్పు వాయిద్యాలతో, బ్యాండు మేళాలతో మహిళలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి 70ఏళ్లు అధికారాన్ని కట్టబెడితే ఏం చేసిందని ఆరోపించారు. తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడాలేని విధంగా అభివృద్ధి చేసి చూపించారని వివరించారు. ప్రజా శ్రేయస్సే ఎజెండాగా బీఆర్‌ఎస్ ముందుకు సాగుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలమోసపు మాటలు నమ్మితే గోస పడతామని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మౌనికమశ్చందర్, బద్దులశ్రీశైలంయాదవ్, రుక్సానాభేగం, పండుగబాలమణిదామోదర్, చేగూరిరాఘవేందర్‌గౌడ్, లక్ష్మీరమేష్, ఎంపీపీ ఖాజాఇద్రీస్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యేభీష్వకిష్టయ్య, వంకాయలనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం**

షాద్‌నగర్: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్మన్ నరేందర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పట్టణంలోని 27వ వార్డులో కౌన్సిలర్ జూపల్లి కౌసల్య శంకర్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని అన్నారు. నాలుగువేల కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టారని వెల్లడించారు. ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్ నేతలు ప్రజలను మభ్యపెట్టేందుకు మాయమాటలు చెబుతున్నారని విమర్శించారు. అభివృద్ధి మరింత ముందుకు సాగాలంటే అంజయ్య యాదవ్‌ను మూడోసారి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ విశ్వం, నాయకులు చింటు, వెంకట్‌రాంరెడ్డి, అంతయ్య, రాఘవేందర్, యుగేందర్, నందకిషోర్, జీటీ శ్రీనివాస్, నందీశ్వర్, శేఖర్, శివ, శరత్‌కృష్ణ, రాఘవేందర్ పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


కొందుర్గు: ఇంటింటి ప్రచారం చేస్తున్న నేతలు

- **బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం**

కొందుర్గు: మండల కేంద్రంలో సోమవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్ మాట్లాడుతూ.. అంజయ్యయాదవ్‌ను మరోసారి గెలిపించుకొని మండలాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని సూచించారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత అంజన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, రామచంద్రయ్య, రామకృష్ణ, ఆనంద్‌కుమార్, చంద్రశేఖర్, సచిన్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

- **అంజన్న గెలుపుతోనే అభివృద్ధి**

కొత్తూరు: షాద్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అంజయ్యయాదవ్ గెలిస్తేనే నియోజకవర్గం మరింత అభివృద్ధి సాధిస్తుందని స్థానిక బీఆర్‌ఎస్ నేతలు అన్నారు. సోమవారం మాజీ ఎంపీటీసీ దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆయా వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అంజయ్య యాదవ్‌కు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, శ్రావన్, ప్రభాకర్‌రెడ్డి, రవినాయక్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన అడ్వకేట్ యాదిరెడ్డి


రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన యాదిరెడ్డి

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీలో చేరటం అంటే తన సొంత గూటికి చేరుకున్నట్లుగా ఉందని మల్కాపూర్ గ్రామానికి చెందిన అడ్వకేట్ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బక్కరెడ్డి యాదిరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నివాసంలో సోమవారం భీంభరత్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు రేవంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రేవంత్‌రెడ్డి కష్టపడి పనిచేసి పార్టీని అధికారంలోకి తీసుకు రావాలని సూచించారని చెప్పారు. చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్‌పార్టీ గెలుపు ఖాయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, నర్సింలు, తదితరులు ఉన్నారు.

అవినీతి నిర్మూలనపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి

మొయినాబాద్: నేటి విద్యార్థులే.. రేపటి పౌరులని.. దేశ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలోని అరిస్టాటిల్ పీజీ కళాశాలలో అవినీతి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పేదరిక నిర్మూలన జరగాలంటే జీరో కరప్షన్ సిస్టమ్ రావాలన్నారు. అలాగే, పరిపాలనలో పారదర్శకత పెరగాలన్నారు. దానికి విద్యార్థి దశ నుంచే పునాదులు పడాలని సూచించారు. ఇండియా అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితా నుంచి అభివృద్ధి చెందిన దేశాల జాబితాలోకి చేరాలని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అవినీతి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రొగ్రాం కోఆర్డినేటర్ జ్యోతిక, అధ్యాపకులు స్వేత, దీప్తి, సురేష్, స్రవంతి, కనకారావు, రమేష్, రాజేంద్రరెడ్డి, నందకిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా శేఖర్

చేవెళ్ల: కాంగ్రెస్ పార్టీ మండల ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా దామరగిద్ద గ్రామానికి చెందిన ఘనాపూరం శేఖర్‌ను నియమించారు. సోమవారం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డిల ఆధ్వర్యంలో ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ గెలుపుకోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డీవీఆర్, మధుసూదన్‌గుప్తా, ఆగిరెడ్డి, మల్లారెడ్డి, శైలజ, సమత, ప్రభాకర్, ఫరూక్ ఉన్నారు.


శేఖర్‌కు నియామక పత్రం అందిస్తున్న, భీంభరత్, నాయకులు

మేకలు, గొర్రెలతో ఆర్థికాభివృద్ధి

మండల పశువైద్యాధికారి దేవీరెడ్డి

మొయినాబాద్‌రూరల్: రైతులు మేకలు, గొర్రెల పోషణతో ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చునని మండల పశువైద్యాధికారి దేవీరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కనకమామిడిలో 1468 మేకలు, గొర్రెలకు పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 21వ తేదీ వరకు ఈ టీకాల పంపిణీ కొనసాగుతోందని తెలిపారు. ప్రతి గ్రామానికి వెళ్లి నాలుగు నెలల పైబడిన మేకలు, గొర్రెలకు ఈ టీకాలు ప్రభుత్వం ద్వారా ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని వివరించారు. రైతులు మేకలు, గొర్రెల పెంపకదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య అధికారులు అమ్డాపూర్ దేవీరెడ్డి, మొయినాబాద్ అహ్మద్, కనకమామిడి శ్రీలతరెడ్డి, పశువైద్య అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

- **మూగ జీవాలను కాపాడుకోవాలి**

షాబాద్: వ్యాధుల నుంచి మూగ జీవాలను రక్షించుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశు వైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కుమ్మరిగూడ, సక్కులూరు గ్రామాల్లో గొర్రెలకు, మేకలకు పారుడు వ్యాధి నిర్వహణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా గ్రామాల్లో పారుడు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. జీవాలకు ఎటువంటి రోగాలు ప్రబలిన వెంటనే పశువైద్య సిబ్బందిని అప్రమత్తం చేయాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులున్నారు.


పశువులకు పీపీఆర్ టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి దేవీరెడ్డి

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి

- పార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి భీంభరత్

షాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని చేవెళ్ల ఆ పార్టీ అభ్యర్థి పామెన భీంభరత్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు శేఖర్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం భీంభరత్ మాట్లాడుతూ.. ప్రజా శ్రేయస్సు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, పార్టీ అధికారంలోకి రాగానే గ్యారంటీ పథకాలు అమలు చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అవినీతి పాలన నడుస్తోందని ఆరోపించారు. గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలను మధ్యపెట్టి కాలం వెల్లదీస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్, పీసీసీ రాష్ట్ర కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, నాయకులు, గ్రామస్తులు తదితరులున్నారు.

- **అభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు ఓటు వేయాలి**

శంకర్‌పల్లి: నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఆపార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ పేర్కొన్నారు. సోమవారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని పత్తేపురం, మండలంలోని టంగటూరు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య కుటుంబ పాలన కొనసాగుతోందని ఆరోపించారు. యాదయ్య తన కుటుంబానికి రెండు జెడ్పీటీసీలు, ఒక ఎంపీపీ పదవులను కట్టబెట్టుకున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో దళిత నాయకులే లేరా అని ప్రశ్నించారు. తాను పేద ప్రజల కోసం పోరాడిన వ్యక్తినని ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు ఉదయమోహన్‌రెడ్డి, శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు ప్రకాష్ గుప్తా, కౌన్సిలర్ రాములు, ఎంపీటీసీలు ఎజాస్, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


షాబాద్: కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు


మొయినాబాద్: కాంగ్రెస్‌లో చేరిన నేతలు

- **కాంగ్రెస్‌లో చేరిన టీడీపీ నేతలు**

మొయినాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ పోటీ నుంచి తప్పుకోవడంతో ఆ పార్టీ నేతలు ఇతర పార్టీల్లో చేరుతున్నారు. సోమవారం చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని పలువురు నేతలు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పరిగి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రయ్య, చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం టీడీపీ అధ్యక్షుడు గూడెం సుభాష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి కొమ్మిడి వెంకట్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ ముదిరాజ్, చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు మాజీ మంత్రి గడ్డం ప్రసాద్, చేవెళ్ల అభ్యర్థి భీంభరత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. రేవంత్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకోసం పనిచేయాలని.. రానున్న రోజుల్లో అందరికి సముచిత స్థానం కల్పిస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఆర్గనైజర్ ఉదయమోహన్‌రెడ్డి, సమన్వయ కమిటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, ఫిషర్మెన్ అధ్యక్షుడు మహేందర్‌ముదిరాజ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

- **కాంగ్రెస్ జెండాను ఎగురవేద్దాం**

చేవెళ్ల: చేవెళ్ల గడ్డ కాంగ్రెస్‌పార్టీ అడ్డాని ఇక్కడ ఈసారి కాంగ్రెస్ జెండాను ఎగురవేద్దామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. సోమవారం మండలంలోని తలారం, దుద్దాగు, ఆలూరు గ్రామాల్లో ఇంటింటి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ వస్తే ఆరు గ్యారంటీలు కచ్చితంగా అమలు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు గ్రామాల్లో బలంగా ఉన్నారని ప్రజలు ఇందిరమ్మ రాజ్యం రావాలని కోరుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గం సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు డీవీఆర్, ఆగిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీను, శ్రీనివాస్, మానిక్యం, సంజీవ్, పాండుయాదవ్, పెంటయ్యగౌడ్, రవి, భార్గవ్ నాయకులు తదితరులుపాల్గొన్నారు.

'కారు'కు ఓటేస్తే కష్టాలు తప్పవు


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న శంకర్

- షాద్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేస్తే కష్టాలు తప్పవని కాంగ్రెస్ అభ్యర్థి శంకర్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లిలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 100మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శంకర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకే సంక్షేమ పథకాలను అందిస్తూ నిజమైన అర్హులకు అన్యాయం చేస్తున్నారని తెలిపారు. నిరుపేదల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధిక మెజార్టీతో గెలిపించి కేసీఆర్ ప్రభుత్వానికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- **మోసం చేసే పార్టీలకు కాలం చెల్లింది**

కొత్తూరు: ప్రజలను మోసం చేసి అభివృద్ధిని కాగితాల్లో మాత్రమే చూపిస్తూ ప్రచారాలు చేసుకునే పార్టీలకు కాలం చెల్లిందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మాల్లాపూర్, మల్లాపూర్‌తండా, రెడ్డిపాలెం, గూడూరు, మక్తగూడ గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ప్రచారాల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గూడూరుకు చెందిన మాజీ సర్పంచ్ మనీల సంజీవ, మాజీ ఎంపీటీసీ మోడి దర్శన్‌తో పాటు భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ.. షాద్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ప్రజల సమస్యలు పట్టించుకోని బీఆర్‌ఎస్ పార్టీకు ఓటు వేయొద్దని సూచించారు. కాంగ్రెస్ పాలనలోనే జరిగిన అభివృద్ధిని బీఆర్‌ఎస్ తాము చేసినట్లుగా ప్రచారం చేసుకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని, అక్రమ కేసులకు భయపడొద్దని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, రాంరెడ్డి, దేవేందర్, ప్రభాకర్, దయానంద్‌గుప్తా, మల్లాపూర్ సర్పంచ్ సాయిలు, కేశంపేట జెడ్పీటీసీ శ్రావణి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


బొడ్రాయికి పూజలు చేస్తున్న అభ్యర్థి శంకర్, ప్రతాప్‌రెడ్డి

చెక్‌పోస్ట్ పరిశీలన

అబ్దుల్లాపూర్‌మెట్: ఎన్నికల నేపథ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను సోమవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్ అదనపు సీపీ తరుణ్‌జోషి పరిశీలించారు. ఈ సందర్భంగా విజయవాడ జాతీయ రహదారిపై వెళ్తున్న పలు వాహనాలను స్వయంగా ఆయన తనిఖీ చేశారు. అనంతరం అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాస్పదంగా భవన శంకుస్థాపన

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని పిగ్లీపూర్‌లో సోమవారం యాదవ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం వివాదంగా మారింది. భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తుండగా.. స్థానిక సర్పంచ్ కోటా రాధ, ఆమె భర్త లక్ష్మారెడ్డి, అతని సోదరులు యాదిరెడ్డి, సాగర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి భూమి పూజను అడ్డుకున్నారు. భవన నిర్మాణం చేస్తున్న భూమి తమదేనని, తమ భూమిలో భవనం ఎలా నిర్మిస్తారని అడ్డుకున్నారు. దీంతో ఆధారాలు చూపించాలని యాదవ సంఘం సభ్యులు ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. శంకుస్థాపనను అడ్డుకోవడంతో పాటు తమను బెదిరించారని యాదవ సంఘం సభ్యులు లక్ష్మారెడ్డి, అతని సోదరులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వాహనాదారులు అలర్ట్

- పత్రాలు, నంబర్ ప్లేట్లు పరిశీలన
- రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ బోస్ కిరణ్


చాలాన్‌లు విధిస్తున్న సీఐ బోస్ కిరణ్

మొయినాబాద్‌రూరల్: వాహనాదారులు నంబర్ ప్లేట్లు, సంబంధించిన పత్రాలను సరిచూసుకోవాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ సీఐ బోస్ కిరణ్ పేర్కొన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లో వాహనాల తనిఖీల్లో భాగంగా కార్లకు బ్లాక్ పేపర్స్, నంబర్ ప్లేట్లు, ఇండికేటర్ లైట్లు, సరైన పత్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలకు సంబంధించిన అన్ని పేపర్లను పరిశీలించి, పైఅధికారుల సూచనల మేరకు చాలన్‌లు విధిస్తున్నామని తెలిపారు. వాహనాదారులు అన్ని సరి చూసుకొని వెళ్లాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై గోపాల్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

యువత స్వయం కృషితో ముందుకు..

- జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి

షాబాద్: యువత స్వయం కృషితో అభివృద్ధి చెందాలని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నాగర్‌కుంట సమీపంలో షాబాద్ గ్రామానికి చెందిన తోంట వెంకటయ్య నూతనంగా నిర్మించిన ఎస్‌వి గార్డెన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధితో ముందుకు సాగాలని సూచించారు. నిరుద్యోగ యువతకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్ రావు, సహకార సంఘం వైస్ చైర్మన్ మల్లేష్, మాజీ చైర్మన్లు వెంకటయ్య, నర్సింహారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, నాయకులు తదితరులున్నారు.


ఎస్‌వి గార్డెన్‌ను ప్రారంభిస్తున్న అవినాశ్‌రెడ్డి తదితరులు